కులకచర్లలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కులకచర్ల, నవంబర్ 7 : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం రైతులకు అందించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించిందని ఆయన తెలిపారు.

కులగణన సర్వేను సక్రమంగా నిర్వహించాలి

కులగణన సర్వేను సక్రమంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం కులకచర్లలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఫార్మాట్‌లో ఉన్న వివరాలను తెలుసుకొని పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని ఎన్యూమరేటర్లకు లింగ్యానాయక్ సూచించారు. కార్యక్రమంలో కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీఎం శోభ, కాంగ్రెస్ పార్టీ కులకచర్ల మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, నాయకులు, కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించాలి

రంగారెడ్డి, నవంబర్ 7 : వరి కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో 2024-25 సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగులుపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లావ్యాప్తంగా 39 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతులు పండించి వరి ధాన్యానికి గ్రేడ్-ఏ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300, సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆరబెట్టి, చెత్తాచెదారం, తేమ లేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకొచ్చేందుకు రైతులు శ్రద్ధ వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతోపాటు అవసరమైన గన్నీ బ్యాగులను రైతులకు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కేంద్రాల్లో అధికారులు రైస్‌మిల్లు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయంతో ఉంటూ కొనుగోళ్లు వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లుకు ధాన్యాన్ని తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏరోజు ధాన్యాన్ని అదే రోజున కొనుగోలు చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వరి ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యంగా ఉండొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌వో సంగీత, జిల్లా ఫౌరసరఫరాల అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి నరసింభారావు, మార్కెటింగ్ శాఖ అధికారి రియాజొద్దీన్, డీసీసీవో సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు

సమగ్ర ఇంటింటి సర్వే

పూడూరు మండలం చెంచుపల్లి గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

పూడూరు, నవంబర్ 7 : ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఎంతగానో దోహదపడుతుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. గురువారం పూడూరు మండలం ఎన్కేపల్లి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన చెంచుపల్లిలో సర్వే ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.. గ్రామాల్లో సర్వే నిమిత్తం అధికారులు వచ్చినప్పుడు తమ పూర్తి సమాచారం ఇచ్చి అధికారులకు సహకరించాలని గ్రామస్తులకు సూచించారు. ఇంటి యజమాని ఇచ్చిన వివరాలను మాత్రమే ప్రొఫార్మాలో పొందుపర్చాలని అధికారులకు వివరించారు. అధికారులకు ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకొని ఎలాంటి తప్పులు లేకుండా ఫారం నింపాలని కలెక్టర్ తెలిపారు.

గ్రామస్తుల వినతి మేరకు చెంచుపల్లిలోని భూముల సమస్యలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని పరిష్కారం దిశగా కృషి చేయాలని తహసీల్దార్ భరత్‌ను ఆదేశించారు. పట్టా పాస్‌బుక్‌లు, ఇతర భూ సమస్యలున్నచో తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్ రైతులకు సూచించారు. గ్రామంలో ఇండ్లపై నుంచి విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే వైర్లను సరిచేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. గ్రామంలోని అంగన్‌వాడీ, పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ నోటు బుక్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీడీవో పాండు, అంగన్‌వాడీ టీచర్ విజయ కుమారి ఉన్నారు.

స్టిక్కరింగ్ తీరు పరిశీలన

రంగారెడ్డి, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) : కుటుంబ సమగ్ర సర్వేలో భాగంగా నార్సింగి మున్సిపాలిటీలోని కోకాపేట్‌లో ఇంటింటికి స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ అపార్ట్‌మెంట్లల్లో స్టిక్కర్లు అంటిస్తున్న ఎన్యూమరేటర్లను కలిసి సర్వేకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే సందర్భంగా సమగ్ర వివరాలు తీసుకున్న అనంతరం, సంబంధిత ఇంటికి సర్వే చేసినట్లు వేసిన స్టిక్కర్‌ను పరిశీలించారు. ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరిపిస్తున్న సర్వేకు ప్రజలంతా సహకరించాలని కోరారు. సర్వేపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ప్రజలకు మరింత సంక్షేమ పథకాలు అందించేందుకే సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

కుటుంబ సర్వేను తనిఖీ చేస్తూ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

దుకాణంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు

కడ్తాల్, నవంబర్ 7: అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు హెచ్చరించారు. గురువారం కడ్తాల్‌తోపాటు ముద్విన్, రావిచేడ్ గ్రామాల్లోని ఎరువుల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని విత్తనాలు, ఎరువుల నిల్వలతోపాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఈ-పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించినప్పుడు రైతులకు తప్పనిసరిగా రశీదులు అందించాలని తెలిపారు. నకిలీ విత్తనాలను అమ్మి రైతులను మోసగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని, ధరల పట్టికతోపాటు ఎరువుల నిల్వలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏవో శ్రీలత, ఏఈవో అభిన వ్‌రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

ఫామ్‌హౌస్‌కు రూ.లక్ష జరిమానా

మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకుమార్‌కు అరవిల్ల ఫాంహౌస్ నిర్వాహకుడిని బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మొయినాబాద్, నవంబర్ 7 : అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహించి మద్యం వినియోగించిన ఫాంహౌస్‌కు ఎక్సైజ్ శాఖ అధికారులు రూ.లక్ష జరిమానా విధించారు. చేవెళ్ల ఎక్సైజ్ సీఐ శ్రీలత తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలంలోని అరవిల్ల ఫాంహౌస్‌లో గత సంవత్సరం ఎలాంటి అనుమతులు లేకుండా ఈవెంట్ నిర్వహించి మద్యం వినియోగించారు. అప్పట్లో ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి ఫాంహౌస్ నిర్వాహకుడిని మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకుమార్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి ఫాంహౌస్ నిర్వాహకుడు ఇటీవల మళ్లీ ఈవెంట్ నిర్వహించి మద్యం వినియోగించారు. చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేసి పట్టుకున్నారు. గురువారం మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకుమార్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు రూ.లక్ష జరిమానా విధించారు. చేవెళ్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, చేవెళ్ల మండలాల్లోని ఫాంహౌస్‌లలో అనుమతి లేకుండా ఈవెంట్స్ నిర్వహించి మద్యం వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా ఈవెంట్ నిర్వహించాలనుకుంటే తప్పనిసరిగా ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని శ్రీలత సూచించారు.

నందిగామలో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న గోవా బ్లాక్ అధికారుల బృందం

గోవా రాష్ట్ర బ్లాక్ అధికారుల బృందం పర్యటన

నందిగామ, నవంబర్ 7: మండల కేంద్రంలో గురువారం గోవా రాష్ట్ర బ్లాక్ అధికారుల సభ్యుల బృందం (30 మంది) పర్యటించారు. మహిళా సంఘాల పనితీరుపై నేరుగా సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోవడం, వ్యాపారాలు ఏర్పాటు చేయడం, రుణాల చెల్లింపు వంటి అంశాలపై ఆరా తీశారు. సంఘాల పనితీరుపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీ అధికారి వెంకటేశ్వర్లు, ఏపీఎం యాదగిరి, సమాఖ్య అధ్యక్షురాలు అమృత, సీసీలు, సమాఖ్య సిబ్బంది, వీవోఏలు పాల్గొన్నారు.

సుమిత్ర కాటన్ మిల్‌లో అగ్నిప్రమాదం

సుమారు రూ.70 లక్షల పత్తి దగ్ధం

పెద్దేముల్, నవంబర్ 7 : మండల పరిధిలోని మారేపల్లి గేటు సమీపంలో గల సుమిత్ర కాటన్ మిల్‌లో గురువారం అగ్నిప్రమాదం జరిగి సుమారు రూ.70 లక్షల పత్తి మంటల్లో ఆహుతైంది. ప్రమాదం జరిగే సమయంలో మిల్‌లో సుమారు 3500 క్వింటాళ్ల పత్తి ఉన్నది. ప్రమాదం ఎలా జరిగింది తెలియాల్సి ఉన్నది. ఫైరింజన్‌లకు సమాచారమిచ్చి మంటలను అదుపు తెచ్చేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అగ్ని ప్రమాదం జరగడంతో స్థానికులు, రైతుల్లో భయాందోళనలు నెలకొనడంతోపాటు స్థానికంగా ఈ ఘటన కలకలం రేపింది.

బాలసదన్ తనిఖీ

పరిగి, నవంబర్ 7 : పరిగిలోని బాలసదానాన్ని జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ సెక్రెటరీ డి.బి.శీతల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలసదన్‌లో ఉంటున్న విద్యార్థినులు, సిబ్బందితో మాట్లాడి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బాలసదన్‌లో తలుపులు, కిటికీలు విరిగాయని., మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని., వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమయానికి నాణ్యమైన భోజనం పెడుతున్నారా, ఇతర వసతుల విషయం తెలుసుకున్నారు. కార్యాలయంలో రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ సంస్థ జిల్లా న్యాయవాదులు, పరిగి లీగల్ ఎయిడ్ న్యాయవాది గౌస్‌పాషా, న్యాయవాది రాజశేఖర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


బాలసదనంలో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా న్యాయ సేవా సాధికార సెక్రటరీ డీబీ శీతల్

శ్రద్ధగా చదువుకొని డాక్టర్లు కావాలి

వికారాబాద్ : విద్యార్థులు ర్యాగింగ్ చేయకుండా చదువుపై శ్రద్ధ వహించి డాక్టర్లు కావాలని జిల్లా న్యాయ సేవా సెక్రటరీ, న్యాయమూర్తి డీబీ శీతల్ తెలిపారు. గురువారం వికారాబాద్ అనంతగిరిలోని జిల్లా మెడికల్ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శీతల్ మాట్లాడుతూ.. మిమ్మలిని మీ తల్లిదండ్రులు ఎంతగానో కష్టపడి చదివిస్తున్నారన్నారు. అందులో ప్రభుత్వ కళాశాలలో సీటు రావాలంటే ఎంత కష్టపడి ర్యాంకు సాధించారో మీకు తెలుసుంటుందన్నారు. మీరు కాబోయే డాక్టర్లు కాబట్టి ర్యాగింగ్ అనే పదం లేకుండా విద్యార్థులందరూ శ్రద్ధగా చదువుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అందంగా లేనా.. అసలేం బాలేనా..!

ఓ పిచ్చుక పదేపదే బైక్ సైడ్ అద్దంలో ప్రతిబింబాన్ని చూసుకున్నది. కొన్నిసార్లు అద్దంలో తన ప్రతిబింబాన్నే ముక్కుతో పొడుస్తూ.. మరికొన్నిసార్లు కిచకిచమంటూ శబ్దాలు చేసింది. ఈ దృశ్యం పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ తట్టిఅన్నారంలో గురువారం కనిపించింది.
- పెద్దఅంబర్‌పేట, నవంబర్ 7

వ్యక్తి హత్య

దారుణానికి పాల్పడ్డ తండ్రి, అన్న

మాడుగుల, నవంబర్ 7 : ఒక వ్యక్తిని తండ్రి, అన్న కలిసి దారుణంగా హత్య చేసిన సంఘటన మాడుగుల మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని గుడితండాకు చెందిన రాత్లావత్ లక్ష్మణ్‌కు ఇద్దరు కుమారులు(పెద్ద కుమారుడు నరేశ్, చిన్న కుమారుడు సురేశ్), ముగ్గురు కూతుర్లు ఉన్నారు. లక్ష్మణ్ గత 40 సంవత్సరాలుగా తన కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అక్టోబర్ 11న దసరా పండుగ సందర్భంగా సొంత గ్రామానికి వచ్చారు. అక్టోబర్ 13న తండ్రి లక్ష్మణ్, పెద్ద కుమారుడు నరేశ్ మద్యం మత్తులో మటన్ కట్ చేసే కత్తితో చిన్న కుమారుడు సురేశ్‌ను కిరాతకంగా గొంతుపై పలుమార్లు దాడి చేసి చంపారు. అనంతరం మృతదేహాన్ని ఆటోలో తీసుకువెళ్లి పొలంలో గుంతలో వేసి పూడ్చినట్లు తెలిపారు. లక్ష్మణ్, నరేశ్ ఎవరికీ అనుమానం రాకుండా హైదరాబాద్‌కు వెళ్లారు. నిందితులు గురువారం మాడుగుల పోలీస్ స్టేషన్‌కు వచ్చి చేసిన తప్పును ఒప్పుకొన్నట్లు సీఐ జగదీశ్ తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు.. ఈ హత్యకు గల కారణాలు అస్తి గొడవలు అని ప్రాథమికంగా తెలిసినట్లు ఆయన పేర్కొన్నారు.

మనీలాండరింగ్ కేసంటూ బెదిరింపు

డిజిటల్ అరెస్ట్ చేసి.. రూ.48 లక్షలు కాజేసిన సైబర్ చీటర్స్

సిటీబ్యూరో, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) : ఢిల్లీ నుంచి సీబీఐ అధికారులం మాట్లాడుతున్నాం.. మీపై మనీ లాండరింగ్ కేసు నమోదయ్యిందంటూ ఓ ప్రభుత్వ ఉద్యోగిని బెదిరించిన సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ చేసి రూ.48 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితుడికి సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి.. మీ బ్యాంకు ఖాతాల్లో రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు డిపాజిట్ అయ్యాయి. మిమ్మల్ని విచారించాలంటూ హెచ్చరించారు. ఓ మహిళ కూడా అధికారినంటూ మాట్లాడుతూ.. ఈ విషయం ఎవ్వరికైనా చెబితే ఇబ్బందిపడతారని భయపెట్టింది. వీడియో కాల్‌లో సుమారు 7 గంటల పాటు విచారణ పేరుతో భయపెట్టించారు. బాధితుడి నుంచి బ్యాంకు ఖాతాలకు సంబంధించిన అన్ని వివరాలు తీసుకున్నారు. ఆర్‌బీఐ బ్యాంకు ఖాతాలోకి డబ్బు పంపించండి.. లేదంటే మిమ్మల్ని అరెస్ట్ చేయాల్సి వస్తుంది.. అంటూ బెదిరించారు. బాధితుడి ఫిక్స్‌డ్ డిపాజిట్లు రద్దు చేయించి రూ.48 లక్షలు కాజేశారు. మీపై ముంబయిలో ఉన్న పోలీసుల నిఘా కొనసాగుతుందంటూ భారీ మోసానికి పాల్పడ్డారు. బాధితుడు సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యాసంగి వరితో లాభాల కంటే నష్టాలే అధికం

ఆరుతడి పంటలే మేలు

- పెట్టుబడి తక్కువ.. లాభాలు రెట్టింపు
- నీరు, కూలీల వినియోగం కూడా తక్కువే..
- సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వం

పంటల సాగుకు తక్కువ పెట్టుబడి ఖర్చుచేసి రెండింతల లాభాలను గడించవచ్చునని ప్రభుత్వం రైతులకు సూచిస్తున్నది. గత వర్షాకాలంలో జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడంతో వరిధాన్యం దిగుబడి కూడా ఎక్కువగా వచ్చింది. వర్షాకాలం పంటలకు చలికాలం పంటలకు ఎక్కువ తేడా ఉండటం వలన చలికాలంలో దిగుబడి కూడా తగ్గే అవకాశాలున్నాయి. అలాగే, అధిక దిగుబడి వచ్చిన వరిధాన్యం కొనుగోలు చేయడం ఇబ్బందికరంగా మారే అవకాశం ఉండటం వలన ఆరుతడి పంటలను సాగుచేసుకోవాలని రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నారు.

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 7 : యాసంగిలో వరి సాగు రైతులు ప్రతిఏటా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. యాసంగిలో చలి తీవ్రత అధికంగా ఉండటం వలన వరికి అనేక రకాల వ్యాధులు సోకుతున్నాయి. ఈ వ్యాధులకు మితిమీరిన రసాయన, క్రిమి సంహారక మందులను వాడటంతో ఆహార కాలుష్యంతో పాటు భూమి కాలుష్యం కూడా పెరుగుతుంది. దీంతో ఒక ఎకరం వరిసాగుకు చలికాలంలో రూ.20వేల నుంచి 30వేల ఖర్చు రావడంతోపాటు దిగుబడి కూడా గణనీయంగా పడిపోతుందని వ్యవసాయశాఖ నిపుణులు అంచనాలు వేశారు. వేసవిలో వరి సాగుకు అగ్గితెగులు, దోమపోటు, పాముపొడతో పాటు తదితర తెగుళ్లు సోకుతుండటంతో వీటి నివారణకు మితిమీరిన క్రిమిసంహారక మందులు వాడక తప్పడంలేదు. దీంతో ఆహార కాలుష్యం అధికం కావడంతోపాటు భూసారంపై కూడా దుష్ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిస్థితిలో యాసంగిలో వరి పంటలు వేయడం వలన రైతులకు ఖర్చు ఎక్కువగా అవడంతో పాటు దిగుబడి కూడా తగ్గే అవకాశాలున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వరికి బదులు ఆరుతడి పంటలు సాగుచేయడమే మేలని రైతులకు సూచిస్తున్నారు. ఆరుతడి పంటల వలన ఖర్చు తక్కువగా కావడమే కాకుండా ఆదాయం రెండింతలు పెరిగే అవకాశముంది. అలాగే, వరి ఎకరాకు అయ్యే నీటి వినియోగంతో రెండు నుంచి మూడెకరాల ఆరుతడి పంటలకు సరిపోతుందని, అలాగే.. ఆరుతడి పంటలకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ నోటు బుక్‌లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీడీవో పాండు, అంగన్‌వాడీ టీచర్ విజయ కుమారి ఉన్నారు.

ఎకరం వరికి సరిపడే నీరు మూడు ఎకరాల ఆరుతడి పంటల సాగు

ఒక ఎకరం వరిపంటకు అవసరమయ్యే నీరు రెండు నుంచి మూడెకరాల ఆరుతడి పంటలకు సరిపోతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వరికి ఒక ఎకరానికి రూ.20వేల నుంచి 30వేల ఖర్చు వస్తుందని ఈ ఖర్చుతో రెండున్నర ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగుచేసుకోవచ్చునని.. దీనిపై రైతులు దృష్టి సారించాలని ప్రభుత్వం రైతుల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నది.

ఆరుతడి పంటలతో అధిక లాభాలు

చలికాలంలో ఆరుతడి పంటల సాగు రైతులకు ఎంతో శ్రేయస్కరంగా ఉంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆరుతడి పంటలు వేయడం వలన తక్కువ నీటి ఖర్చుతో పాటు అతి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించవచ్చును. ఆరుతడి పంటలైన మినుములు, పెసర్లు, వేరుశనగ, కందులు, ఆముదం వంటి పంటలకు తక్కువ ఖర్చుతో వరికి వచ్చే దిగుడికి మూడింతల అధిక ఆదాయం వస్తుందని వ్యవసాయ నిపుణులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆరుతడి పంటలు వేయడం వలన చీడపీడల సమస్యలు కూడా ఉండవని సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆరుతడి పంటల దిగుబడి తక్కువ కాలంలో రైతులకు చేరుతుందని, మినుములు, పెసర్లు కేవలం 75 రోజుల నుంచి 90 రోజుల్లోపు రైతు చేతికి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో మినుములకు క్వింటాల్‌కు రూ.6800 ధర ఉన్నది. ప్రభుత్వమే మినుముల కొనుగోలు చేస్తుంది. అలాగే, ఆరుతడి పంటలకు కూలీల వినియోగం కూడా తక్కువగా ఉండటం వలన రైతు చేతికి దిగుబడి అధికంగా వస్తుంది.

ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలపైనే దృష్టి సారించాలి. ఆరుతడి పంటలతో రైతులు అధిక దిగుబడులు వచ్చే అవకాశమున్నందున వరిని మరిచి మినుములు, రాగులు, కంది, జొన్న, మొక్కజొన్న, పత్తి, ఆముదం, సజ్జలు, నూనెగింజలతో పాటు పలు రకాల పంటల సాగుపై దృష్టి సారించాలి.

- సుజాత, ఏడీఏ, ఇబ్రహీంపట్నం

ఆరుతడి పంటలతోనే మంచి లాభాలు

రైతులు యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగుచేస్తేనే మంచి దిగుబడి, వరికి బదులుగా జొన్న, కంది, మొక్కజొన్న, రాగులు, ఆముదం, పత్తి, నూనెగింజల పంటలు సాగుచేసుకోవాలి. ఈ సీజన్‌లో వరిపంట సాగుచేస్తే అధిక నష్టం వాటిల్లే అవకాశమున్నందున ఆరుతడి పంటలపై దృష్టి సారిస్తేనే ఎంతో మేలు.

- మొద్దు అంజిరెడ్డి, ఉత్తమ రైతు

సేంద్రియ ఎరువుల వాడకంతోనే ఆరుతడి పంటలు

ఆరుతడి పంటలకు ఎలాంటి క్రిమిసంహారక మందులు, కృత్రిమ ఎరువులు అవసరం లేకుండానే సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రకృతిలో సహజంగా తయారయ్యే కంపోస్టు, వర్మీకంపోస్టు, పశువులు, కోళ్ల పేడ ద్వారా తయారయ్యే సహజమైన ఎరువులు వాడి ఈ పంటలు సాగుచేసుకుని అధిక దిగుబడులు సాధించేందుకు వీలుంటుందని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.